

సంగారెడ్డి, మెదక్‌లో 33 మంది
ఎంపీడీవోల బదిలీలు

మెదక్/సంగారెడ్డి క్రైం, ఫిబ్రవరి 11: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో అధికారుల బదిలీలు కొనసాగుతున్నాయి. సొంత జిల్లాలో పనిచేస్తున్నవారు, మూడేళ్లకు పైగా ఒకేచోట పనిచేస్తున్న ఉద్యోగులను ఇతర జిల్లాలకు బదిలీ చేయాలని ఎన్నికల కమిషన్ ప్రభుత్వాన్ని ఆదేశించిన విషయం తెలిసిందే. ఈమేరకు సంగారెడ్డి జిల్లాలో 20 మంది, మెదక్ జిల్లాలో 13 మంది ఎంపీడీవోలను ప్రభుత్వం బదిలీ చేసింది. ఈమేరకు ఆదివారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. సంగారెడ్డి జిల్లాలో పనిచేస్తున్న ఎ.రవీందర్, ముజాఫారొద్దీన్ నిజామాబాద్‌కు, ఎ.రాములు, కె.విశ్వప్రసాద్‌ను వికారాబాద్ జిల్లాకు, ఎస్.పి.జయలక్ష్మి, డి.మల్లేశ్వర్, కె.పూజ, జి.వెంకటేశం, ఎ.చంద్రశేఖర్, పి.మంజుల, కె.సుజాత, సి.సుజాత, శారదాదేవి, ఎ.వెంకటేశ్వర్‌రెడ్డి, ఎస్.వెంకట్‌రెడ్డిని నల్గొండ జిల్లాకు, షాజీలొద్దీన్, ఎం.మధులతను మెదక్ జిల్లాకు, ఎం.బన్సీలాల్, కె.సుజాతానాయక్, పి.సుమతిని రంగారెడ్డి జిల్లాకు బదిలీ చేశారు.

అలాగే, మెదక్ జిల్లాలో పనిచేస్తున్న మార్టిన్ లూథర్, గణేష్‌రెడ్డి, వెంకటలక్ష్మమ్మ, జీ.శ్రీరాములును సిద్దిపేట జిల్లాకు, యాదగిరిరెడ్డి, ఆనందమయి, శశిప్రభ, డి.ఉమాదేవి, పి.శ్రీనివాస్, వి.శ్రీరాం, ఎం.సత్యనారాయణ ప్రసాద్‌ను సంగారెడ్డి జిల్లాకు, సిహెచ్.అరుంధతిని రంగారెడ్డిజిల్లాకు, కె.ప్రవీణ్‌ను నిజామాబాద్ జిల్లాలకు బదిలీ చేశారు. వెంటనే తమకు కేటాయించిన మండలాల్లో రిపోర్టు చేయాలని వారిని ఆదేశించారు.

చేను చుట్టూ చీరల ప్రహరీ!

జొన్న పంటను అడవిపందుల బారి నుంచి కాపాడుకోవడానికి ఓ రైతు ఇలా చీరలతో కంచె ఏర్పాటు చేశాడు. సంగారెడ్డి జిల్లా అందోల్ మండలం డాకూరులో రైతు మల్లయ్య రెండెకరాల్లో జొన్న సాగు చేస్తున్నాడు. చేను చుట్టూ ఇలా రంగురంగుల చీరలు కట్టడం వల్ల అడవిపందులు బెదిరిపోయి అటువైపు రావడం లేదని ఆయన తెలిపారు.

-ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి



పునరుద్ధరణ సాధ్యమేనా?



మంబోజిపల్లిలో మూతపడిన నిజాం షుగర్స్ పరిశ్రమ

- కోర్టు కేసులతో చిక్కులు
- 90 శాతం ఉద్యోగుల రిటైర్మెంట్
- శిథిలావస్థకు చేరిన భవనాలు
- తుప్పు పట్టిన యంత్రాలు
- నిజాం షుగర్స్‌పై ప్రభుత్వం ఎదుట ఎన్నో సవాళ్లు

మెదక్, ఫిబ్రవరి 11: నిజాం చక్కెర కర్మాగారాల పునరుద్ధరణపై రాష్ట్ర సర్కారు దృష్టి సారించింది. సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేయడానికి సిఫార్సుల కమిటీని ఏర్పాటు చేసింది. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, సిఫార్సుల కమిటీ చైర్మన్, పరిశ్రమలశాఖ మంత్రి శ్రీధర్‌బాబు, వైస్ చైర్మన్, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, సభ్యులైన ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, జీవన్‌రెడ్డి, రోహిత్‌రావు అధికారులతో సమావేశమయ్యారు. కమిటీ నివేదిక ఇచ్చిన అనంతరం తీసుకోవాల్సిన చెర్యలపై మరోమారు సమావేశం నిర్వహించాలని సీఎం సూచించారు.

లాభాల నుంచి దివాలా దిశగా..

నిజాం షుగర్ ఫ్యాక్టరీ మెదక్ మంబోజీపల్లి యూనిట్ పరిధిలో ప్రతీ సీజన్‌లో 1.80 లక్షల మెట్రిక్ టన్నుల చెరుకు క్రషింగ్ చేసేవారు. 200 మంది రెగ్యులర్, మరో 200 మంది సీజనల్, 500 మంది క్యాజువల్ కార్మికులకు ఉపాధి లభించేది. ఈక్రమంలో నిజాం షుగర్స్‌లో 51 శాతం వాటాను ప్రభుత్వం 2002లో డేల్టా పేపర్స్ సంస్థ అధిపతి గోగినేని గంగరాజుకు విక్రయించింది. దీంతో నిజాం దక్కన్ షుగర్స్ లిమిటెడ్‌గా రూపాంతరం చెందింది. మొదట రెండేళ్ల పాటు లాభాలతో నడిచినప్పటికీ క్రమేపీ ఫ్యాక్టరీ నష్టాలను చవిచూసింది. 2004లో అధికారంలోకి వచ్చిన వైఎస్ ప్రభుత్వం నిజాం షుగర్స్ ప్రవేటీకరణపై సభా సంఘాన్ని వేసింది. ఈ సంఘం 2006లో సమర్పించిన తన నివేదికలో నిజాం షుగర్స్ ప్రైవేటీకరణ అక్రమమని, నిజాంషుగర్స్‌ను స్వాధీనం చేసుకోవాని సిఫారసు చేసింది. కానీ ఆ తర్వాత ఏ చర్యలూ తీసుకోలేదు. క్రమంగా నష్టాల్లోకి వెళ్లిన పరిశ్రమను మూసివేస్తూ యాజమాన్యం 2015 డిసెంబరు 22న లే-ఆఫ్ ప్రకటించింది. యాజమాన్యం చేసుకున్న దివాలా పిటీషన్‌పై పలు దఫాల విచారణ అనంతరం నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ 2019లో నిజాం షుగర్స్ లిక్విడేషన్‌ను నిలిపివేస్తూ తీర్పు ఇచ్చింది. యాజమాన్యం సుప్రీంకోర్టులో సవాలు చేయగా ప్రస్తుతం విచారణలో ఉంది.

పనికిరాని యంత్రాలు

నిజాం షుగర్స్‌ను తెరిచే అవకాశాలను పరిశీలించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవడంతో కార్మికులు, రైతుల్లో ఆశలు చిగురించాయి. కానీ అదంత సులభంగా అయ్యేలా కనిపించడం లేదు. మంబోజిపల్లి నిజాంషుగర్స్ ఫ్యాక్టరీలో ఖరీదైన యంత్రాలు ఉండేవి. ప్రతీ క్రషింగ్ సీజన్‌కు ముందు యంత్రాలను ఓవర్ హోలింగ్ చేసేవారు. పదేళ్లగా కర్మాగారం మూసివేయడంతో యంత్రాలన్నీ తుప్పుపట్టి పనికిరాని స్థితి చేరుకున్నాయని కార్మికులు సందేహం వ్యక్తం చేశారు. 1.5 మెగావాట్ల సామర్థ్యం గల రెండు పవర్ టర్బైన్లను పాతిక సంవత్సరాల క్రితం రూ.2కోట్లు వెచ్చించి యాజమాన్యం కొనుగోలు చేసింది. ప్రస్తుతం అవి చెడిపోయి ఉంటాయని తెలిపారు. కెమికల్ సెక్షన్ కూడా పనికిరాకుండా పోయిందని అంచనా వేస్తున్నారు. చెరుకును గానుగ ఆడించే క్రషర్లను మాత్ర ఓవర్ హోలింగ్ చేస్తే పనిచేసే అవకాశం ఉందని నిపుణులు తెలిపారు. ఫ్యాక్టరీ సీలింగునకు ఉపయోగించిన ఇనుప రేకులు చాలా వరకు ధ్వంసమయ్యాయి. కార్మికుల్లో ప్రస్తుతం 90 శాతం రిటైర్‌మెంట్ వయసు దాటిపోయారు. లే-ఆఫ్ ప్రకటించడంతో ఉద్యోగ విరమణ ప్రయోజనాలకు నోచుకోలేదు.

వీఆర్‌ఎస్ వర్తింపజేయాలి



నిజాం షుగర్స్‌లో పనిచేసిన కార్మికులకు వీఆర్‌ఎస్ వర్తింపజేయాలి. పది సంవత్సరాల క్రితం హటాత్తుగా ఫ్యాక్టరీకి లే-ఆఫ్ ప్రకటించడంతో వందలాది ఉపాధి కోల్పోయారు. కుటుంబాలు వీధినపడ్డాయి. ఆందోళనతో పలువురు కార్మికులు మంచంపట్టి మృతిచెందారు. ఫ్యాక్టరీని మళ్లీ ప్రారంభించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవడం సంతోషకరం. ఇంతకుముందు పనిచేసినవారినే కొనసాగించాలి. వయసు మీదపడిన వారికి వీఆర్‌ఎస్ అవకాశం కల్పించాలి. వయసు దాటినివారికి రైటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలి.

-కిషన్, నిజాం షుగర్స్ కార్మికుడు



మంబోజిపల్లిలో శిథిలావస్థలో ఉన్న ప్లాంటు

ఆరోగ్య సేవల్లో
వెనకడుగు

- రాష్ట్ర స్థాయిలో సంగారెడ్డి జిల్లాకు ఏడో ర్యాంకు
- వెల్లడించిన వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ
- పర్యవేక్షణ లేక పడిపోతున్న జిల్లా స్థానం
- మూడేళ్లుగా లేని రెగ్యులర్ డీఎంహెచ్‌వో



సంగారెడ్డిలోని డీఎంహెచ్‌వో కార్యాలయం

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 11: సంగారెడ్డి జిల్లాలో వైద్య ఆరోగ్యశాఖ పనితీరు రోజురోజుకూ దిగజారుతోంది. ప్రజలకు సేవలందించడంలో వెనుకబడిపోతుంది. ఇటీవల వైద్య ఆరోగ్య శాఖ రాష్ట్ర స్థాయిలో జిల్లాలకు ర్యాంకులు ప్రకటించింది. ఇందులో సంగారెడ్డి జిల్లా 57.33 శాతం స్కోర్‌తో ఏడో స్థానంలో నిలిచింది. గతేడాది జనవరి నుంచి డిసెంబరు వరకు వైద్య ఆరోగ్య సేవల అమలులో భాగంగా వివిధ విభాగాల్లో పనితీరును పరిశీలించి విభాగాలవారీగా మార్కులు కేటాయించారు. ఇందులో మెటర్నల్ హెల్త్(ప్రసవాలు)57.33 శాతం, చిన్నారుల ఆరోగ్యం, ఇమ్యూనైజేషన్‌లో 30.4 శాతం, ఆర్‌బీఎస్‌కే 85.48 శాతం, ఎనీమియా ముక్త్ భారత్‌లో 49.72 శాతం, బీపీ, మధుమేహం(ఎన్‌సీడీ) స్క్రీనింగ్‌లో 87 శాతం, టీబీ 40 శాతం స్కోర్ వచ్చింది. అంతకుముందు ఏడాదిలో 59.41 శాతం స్కోర్‌తో జిల్లా ఆరో స్థానంలో నిలువగా.. తాజా ఫలితాల్లో ఒక స్థానం దిగజారింది.

క్షేత్రస్థాయి పర్యటించని 'పీవో'లు

జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో వివిధ విభాగాలకు ప్రోగ్రాం ఆఫీసర్లు ఉన్నారు. వీరంతా జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆస్పత్రులను క్షేత్ర స్థాయిలో పర్యటించి వారికి కేటాయించిన వైద్య ఆరోగ్య కార్యక్రమాలకు సంబంధించి కేంద్ర, రాష్ట్ర ఆరోగ్య పథకాలను అమలు చేయడంతో పాటు పర్యవేక్షించాల్సి ఉంటుంది. ప్రతీ ప్రోగ్రాం ఆఫీసర్‌కి క్షేత్రస్థాయిలో పర్యటించేందుకు ప్రభుత్వం వాహన సౌకర్యాన్ని కల్పించింది. ప్రతీ నెలా రూ.33 వేల వాహన భత్యం చెల్లిస్తున్నది. కానీ ప్రోగ్రాం ఆఫీసర్ రోజూ ఎక్కడికి వెళ్లాలన్న యాక్షన్‌ప్లాన్ లేదు. నిబంధనల ప్రకారం ప్రతి నెలా అడ్వాన్స్ టూర్ ప్రోగ్రాం సిద్ధం చేసుకుని క్షేత్రస్థాయిలో పర్యటించాల్సి ఉన్నా అమలు జరగడం లేదని ఆరోపణలున్నాయి. మరోవైపు కొందరు ప్రోగ్రాం ఆఫీసర్లు సొంత వాహనాలనే అద్దె వాహనాలుగా చూపించి ప్రభుత్వం నుంచి భత్యం తీసుకుంటున్నట్లు విమర్శలున్నాయి. హైర్ వాహనాలకు సంబంధించి లాగ్‌బుక్ నిర్వహణ లేదు. ట్యాక్స్‌ప్లేట్, డ్రైవర్ ఉండాలన్న నిబంధనలు పాటించడం లేదు.

కొరవడిన ఉన్నతాధికారుల పర్యవేక్షణ

వైద్య ఆరోగ్య శాఖ కార్యక్రమాల అమలులో ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నది. వైద్య ఆరోగ్యశాఖ, టీవీవీపీ, డీఎంఈ పరిధిలోని వైద్య అధికారుల మధ్య సమన్వయ లోపించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలను క్షేత్ర స్థాయిలో పక్కగా అమలయ్యేలా వైద్య సిబ్బంది చొరవ తీసుకుంటే జిల్లా మెరుగైన ర్యాంకు సాధించే అవకాశముంది. ఎవరికి వారే యమునా తీరే.. మా పరిధిలో మేమే బాస్ అన్నట్టు వ్యవహరించడంపై ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా జిల్లాలో మూడేళ్లుగా రెగ్యులర్ డీఎంహెచ్‌వో లేకపోవడం కూడా జిల్లా వెనకబాటుకు కారణమన్న విర్శలున్నాయి.



జూనియర్ సాఫ్ట్‌బాల్ బాలుర ఛాంపియన్స్ మెదక్ జిల్లా జట్టు


రాష్ట్ర స్థాయి జూనియర్ బాలుర సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో మెదక్ జిల్లా జట్టు మొదటి స్థానంలో నిలిచింది. హన్మకొండ జిల్లా ధర్మసాగర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో శని, ఆదివారాల్లో 9వ రాష్ట్ర స్థాయి జూనియర్ బాలుర సాఫ్ట్‌బాల్ పోటీలు నిర్వహించారు. ఫైనల్‌లో మెదక్ జిల్లా జట్టు 11-06 తేడాతో హన్మకొండ జట్టును ఓడించి బంగారు పతకం సాధించింది. ప్రతిభ చూపిన మెదక్ క్రీడాకారుడు తరుణ్ ఉత్తమ క్రీడాకారుడిగా ఎంపికయ్యారు. బంగారు పతకం సాధించిన జట్టును సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు నారాయణగుప్తా, ఉపాధ్యక్షుడు అజయ్‌కుమార్‌గౌడ్, ప్రధానకార్యదర్శి శ్యాంసుందర్‌శర్మ, కోశాధికారి గోవర్ధన్‌గౌడ్ అభినందించారు.

-తూప్రాన్

వెలుగులకు నో 'స్కోర్'!

- క్రమబద్ధీకరణకు నోచుకోని 'స్కోర్' ఉద్యోగులు
- ఏళ్లుగా చాలీచాలని జీతంతో వెతలు
- రెగ్యులరైజ్ చేయాలని హైకోర్టు ఉత్తర్వులు
- 12 ఏళ్లుగా అమలు చేయని అధికారులు
- ఇంధన కార్యదర్శి ఆదేశాలూ బేఖాతరు
- కొత్త ప్రభుత్వంపై కార్మికుల ఆశలు

7లో



శ్రీవైకుంఠపురానికి బహ్మోత్సవ కళ

సంగారెడ్డి పట్టణ శివారులోని శ్రీవైకుంఠపురం ఆలయ 11వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు అంకురార్పణం, అశ్వవాహన సేవ నిర్వహించారు. నేడు పెద్దశేషవాహనం, చంద్రప్రభ వాహనం, రేపు హనుమత్ వాహనం, హంసవాహనం, 14న కల్యాణోత్సవం, సూర్యప్రభ వాహనం, గరుడ వాహనం, 15న గజవాహనం, కల్పవృక్ష వాహనం, తెప్పోత్సవం నిర్వహిస్తారు. 16న రథోత్సవం, చక్రస్నానం, పుష్పయాగంతో ఉత్సవాలు ముగుస్తాయని ఆలయ ప్రధానార్చకుడు కందాడై వరదాచార్యులు తెలిపారు.

-సంగారెడ్డి అర్బన్

కోరమీసాల మల్లన్నకు
కోటి దండాలు

నాలుగోవారం జాతరకు భారీగా భక్తుల తరలిరాక


చేర్యాల, ఫిబ్రవరి 11 : కొమురవెల్లి మల్లన్న ఆలయ బ్రహ్మోత్సవాలలో భాగంగా నాలుగోవారం జాతరను పురస్కరించుకుని ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా దండిగా మొక్కుబడులు తీర్చుకున్నారు. పవిత్రమైన కోనేరులో స్నానమాచరించారు. మల్లన్నకు సంప్రదాయబద్ధంగా మట్టికుండలలో బెల్లం పాయసం వండి భక్తిప్రపత్తులతో బోనం నివేదించారు. చెలక, నజరు, ముఖమండప పట్నాలు రచించి స్వామివారి దర్శించుకుని ఒడిబియ్యం సమర్పించి తమను కాపాడమని వేడుకున్నారు. తమ కోరికలు ఈడేర్చమని వేడుకుంటూ ఆలయ ప్రాంగణంలోని గంగిరేగుచెట్టుకు ముడుపులు కట్టారు. మల్లన్న సహోదరి ఎల్లమ్మతల్లికి కల్లు, బెల్లం పానకం సాకపెట్టి బోనం నివేదించారు. ఒడిబియ్యం సమర్పించి తమ పసుపు, కుంకుమలు, పాడిపంటలు చల్లగా కాపాడాలని వేడుకున్నారు.



పట్నం వేయిస్తున్న భక్తులు



కొమురవెల్లిలో భక్తుల రద్దీ





మెదక్‌లో నిర్వహించిన విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు

'కారు' ఇక.. ఫామ్‌హౌస్‌కే!

- బీఆర్ఎస్‌కు ఓట్లేస్తే మురుగు కాలువలో వేసినట్లే
- కేంద్ర ప్రభుత్వ నిధులతో ఏడుపాయలను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతాం
- మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు

మెదక్ అర్బన్/పాపన్నపేట, ఫిబ్రవరి 11: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కారు ఫామ్‌హౌస్‌లో విశ్రాంతి తీసుకోవడం తప్పా.. ప్రజలకు సేవ చేయదని బీజేపీ దుబ్బాక మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు ఎద్దేవా చేశారు. ఆదివారం రాత్రి మెదక్ జిల్లా కేంద్రంలోని ఓ గార్డెన్‌లో మెదక్, హావేళీఘణపూర్, పాపన్నపేట మండల కేంద్రంలోని మంజీరా ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయా సమావేశాలకు రఘునందన్‌రావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రతీ గడపకు తీసుకెళ్లాల్సిన బాధ్యత కార్యకర్తలందరిపైనా ఉన్నదన్నారు. గ్రామాల్లో బూత్ స్థాయి నుంచి బీజేపీని బలోపేతం చేసి వచ్చే ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలన్నారు. మూడోసారి ప్రధానమంత్రిగా మోదీని ప్రజలు చూడాలనుకుంటున్నారని పేర్కొన్నారు. మెదక్ పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిని గెలిపిస్తే కేంద్ర ప్రభుత్వ పథకమైన ప్రసాద్ దర్శన్ నిధులతో ఏడుపాయల దుర్గమ్మ అమ్మవారి క్షేత్రాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. మెదక్ బీజేపీ ఎమ్మెల్యే, ఎంపీ లేకున్నా మెదక్ నుంచి ఎల్కతుర్తి వరకు రూ.16 కోట్లతో 765 కిలోమీటర్ల జాతీయ రహదారి నిర్మించిందన్నారు. అంతేకాకుండా మెదక్ రైలు తెచ్చిన ఘనత బీజేపీదేనని చెప్పారు. పల్లెల్లో వేసిన సీసీరోడ్లు, వీధిలైట్లు, మరుగుదొడ్లు, శ్మశానవాటికలు, ఉపాధిహామీ పనులన్నీ కేంద్ర ప్రభుత్వం చేసిందని గుర్తు చేశారు. పదవీ కాలం ముగిసిన సర్పంచులకుకేంద్ర ప్రభుత్వం గురించి చాలా తెలుసన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మెదక్ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, అసెంబ్లీ ఇన్‌చార్జి పంజా విజయ్‌కుమార్, జిల్లా కార్యదర్శులు శ్రీనివాస్, ఎంఎల్ఎన్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, నందారెడ్డి, మండలాధ్యక్షుడు రాములు, సీనియర్ నాయకులు సంతోష్‌చారి, సత్యం, నరేష్, ఏసు, తదితరులు పాల్గొన్నారు.

కానరాని లహరి బస్సులు

- సూపర్ లగ్జరీ, డీలక్స్‌తో సరి
- ఇవే పూర్తిస్థాయిలో నిండని పరిస్థితి
- అందుకే లహరి బస్సులు నడపలేమంటున్న అధికారులు



సిద్దిపేట ఆర్టీసీ బస్టాండ్

సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 11 : ఇప్పటివరకు సూపర్ లగ్జరీ, డీలక్స్ బస్సుల్లో ప్రయాణం చేసిన ప్రయాణికులకు సౌకర్యవంతమైన సులభతరమైన ప్రయాణాన్ని అందించడానికి అందుబాటులోకి తెచ్చిన లహరి బస్సులు మాత్రం ఉమ్మడి జిల్లాలో కానరావడం లేదు. స్వయంగా రవాణా శాఖ మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న సిద్దిపేట జిల్లాలో లేకపోవడం గమనార్హం. సిద్దిపేట నుంచి షోలాపూర్, తిరుపతి, కామారెడ్డి, సికింద్రాబాద్, కరీంనగర్, వేములవాడ, హుస్నాబాద్, సంగారెడ్డి లాంటి జిల్లాలకు రోజువారీగా ప్రయాణికులు ప్రయాణం చేస్తున్నారు. రాష్ట్రంలోని ప్రధాన పట్టణంగా ఎదిగిన సిద్దిపేట ఆర్టీసీ డిపోలో లహరి బస్సు సౌకర్యం అందుబాటులో లేకపోవడంతో ప్రయాణికుల నుంచి కొంత అసంతృప్తి వ్యక్తమవుతున్నది. అయితే సూపర్ లగ్జరీ, డీలక్స్ బస్సుల్లోనే ప్రయాణించేందుకు పూర్తిస్థాయిలో మొగ్గు చూపడం లేదని, ఇక లహరి బస్సులు నడిపితే ఆర్టీసీకి నష్టం వాటిల్లే అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. లహరి బస్సులో 20 మంది ప్రయాణికులు కూర్చునేందుకు, 8 మంది వరకు పడుకోవడానికి అవకాశం ఉంటుంది. మామూలుగా సూపర్ లగ్జరీ, డిలక్స్ బస్సులలో 40 మంది ప్రయాణించడానికి అవకాశం ఉంటుంది. టికెట్ ధర కూడా వాటితో పోల్చుకుంటే లహరికి 80 శాతం ఎక్కువగా ఉంటుంది.

ఇప్పట్లో లహరి బస్సులు లేనట్టే

సిద్దిపేట డిపో పరిధిలో లహరి బస్సుల సౌకర్యం ఇప్పట్లో ఉండే అవకాశం లేదు. అంత ధర పెట్టి ప్రయాణికులు ప్రయాణించే పరిస్థితి లేదు. ప్రయాణికులు కోరుకుంటే భవిష్యత్తులో లహరి బస్సు సౌకర్యం కల్పించే అవకాశం ఉండవచ్చు.

- సుఖేందర్‌రెడ్డి, ఆర్టీసీ డిపో మేనేజర్

యువకుడి అదృశ్యం


దీపక్ (ఫైల్)

చేగుంట, ఫిబ్రవరి 11: అయోధ్యకు వెళుతున్నానని ఇంట్లో చెప్పి వెళ్లిన యువకుడు అదృశ్యమైయాడు. ఈ సంఘటన చేగుంట మండలం పులిమామిడి గ్రామంలో ఆదివారం చోటుచేసుకున్నది. కిష్టాపూర్ గ్రామానికి చెందిన పోతుగంటి దీపక్ (23) ఈ నెల 7న అయోధ్యకు వెళుతున్నానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. కుటుంబ సభ్యులు అతనికి ఫోన్ చేయగా ఫోన్ స్విచ్ఛాఫ్ వచ్చింది. బంధువుల వద్ద వాకబు చేసినా అతని ఆచూకీ లభించలేదు. దీపక్ తాత పోతుగంటి బాల్‌నర్సయ్య ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ హరీష్ గౌడ్ తెలిపారు.

వెలుగులకు నో 'స్కోర్'!

- క్రమబద్ధీకరణకు నోచుకోని ఉద్యోగులు
- ఏళ్లుగా చాలీచాలని జీతంతో వెతలు
- రెగ్యులరైజ్ చేయాలని హైకోర్టు ఉత్తర్వులు
- 12 ఏళ్లుగా అమలు చేయని అధికారులు
- ఇంధన కార్యదర్శి ఆదేశాలూ బేఖాతరు

జోగిపేట, ఫిబ్రవరి 11: వారంతా.. అందోలు నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు వెలుగులు పంచే విద్యుత్ శాఖ ఉద్యోగులు. కానీ, వారి జీవితాలకు ముప్పై ఏళ్లుగా చీకట్లే మిగిలాయి. దేవుడు వరమిచ్చినా, పూజారి వరమివ్వని చందంగా తయారైంది సంగారెడ్డి జిల్లా అందోలు నియోజకవర్గంలోని 'స్కోర్' ఉద్యోగుల పరిస్థితి. వీరి ఉద్యోగాలను క్రమబద్ధీకరించమని హైకోర్టు తీర్పు ఇచ్చినా, రెగ్యులరైజ్ చేయమంటూ ఇంధన కార్యదర్శి ఆదేశాలిచ్చినా.. వాటినన్నిటినీ ట్రాన్స్‌కో ఉన్నతాధికారులు బుట్టదాఖలు చేశారు. పెద్ద పెద్ద స్థానాల్లో ఉన్న ప్రజాప్రతినిధుల బంధువులు, కుటుంబ సభ్యులకు అర్హతలేకున్నా, ఒక్కరోజు ఉద్యోగం కూడా చేయకున్నా, వారిని పర్మినెంట్ చేస్తూ ఆదేశాలిచ్చిన ట్రాన్స్‌కో ఉన్నతాధికారులు.. అన్ని అర్హతలు ఉండి 30 ఏళ్ళుగా చాలీ చాలని జీతంతో వెట్టి చాకిరీ చేస్తున్న 'స్కోర్' ఉద్యోగుల పట్ల మాత్రం పట్ల మాత్రం వివక్ష చూపుతున్నారు.

1982-83లో జోగిపేట (అందోలు నియోజకవర్గం) కేంద్రంగా సంజయ్ కోఆపరేటివ్ గ్రామీణ విద్యుత్ సంస్థ (స్కోర్) ఏర్పాటైంది. అప్పటి అందోలు నియోజకవర్గ పరిధిలోని అందోలు, పుల్కల్, అల్లాదుర్గం, రేగోడ్ మండలాలు, మెదక్ నియోజకవర్గానికి చెందిన టేక్మాల్, పాపన్నపేట, పెద్ద శంకరంపేట మండలాలకు ఈసంస్థ ద్వారా విద్యుత్తు సరఫరా, మెయింటెనెన్స్ తదితర కార్యకలాపాలు నడిచేవి. అప్పట్లో అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ), ఆపై ఉండే ఉన్నత స్థాయి ఉద్యోగులను మాత్రం నేరుగా నోటిఫికేషన్‌తో నియమించుకున్నారు. కిందిస్థాయి సిబ్బందిని మాత్రం క్యాజువల్ లేబర్‌గా దినసరి వేతనంతో స్కోర్ నిబంధనల మేరకే నియమించుకున్నారు. నిబంధనల ప్రకారం 240 రోజుల తర్వాత వారిని కన్సాలిడేటెడ్ కార్మికులుగా గుర్తిస్తూ అప్పటి యాజమాన్యం జారీ చేసింది. ఇలా 77 మంది కన్సాలిడేటెడ్ కార్మికులు నియామకమయ్యారు.సంస్థ నష్టాల్లో ఉండటంతో 2005లో అప్పటి ఏపీసీపీడీసీఎల్ (ప్రస్తుత టీఎస్ఎస్‌పీడిసిఎల్)లో సంస్థను విలీనం చేసారు. అయితే, పర్మనెంట్ ఉద్యోగులు (అప్పట్లో రిక్రూట్ మెంట్ ద్వారా చేర్చుకున్న వారిని)ను సూపర్ న్యూమరీ పోస్టులలో (సూపర్ న్యూమరీ పోస్ట్ అంటే, పదోన్నతి లేకుండా రిటైర్‌మెంట్ వరకూ ప్రస్తుతం ఉన్న స్థాయిలోనే ఉంటూ వేతనాలు మాత్రం ఇతర రెగ్యులర్ ఉద్యోగుల్లానే పొందే విధంగా) 50 మంది నియమితులయ్యారు. ఈ ఉద్యోగులు రిటైర్ అయిన పిదప సదరు ఉద్యోగాలు (పోస్టులు) ఆటోమేటిక్‌గా రద్దు అవుతాయి. కిందిస్థాయిలో ఉన్న 77 మంది కార్మికులకు మాత్రం స్కోర్‌లో ఇచ్చిన వేతనాన్ని మాత్రమే చెల్లిస్తూ.. వారి అర్హతల ఆధారంగా ఖాళీగా ఉన్న కార్మిక పోస్టులలో భర్తీ చేసుకున్నారు. వీరికి ఎలాంటి వేతన పెంపు గానీ, ఇతర భత్యాలు గానీ ఉండవు. ఈ నేపథ్యంలో తమకు వేతనాలు పెంచాలని, రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించి పర్మనెంటు చేయాలని పలుమార్లు ఐఎన్టీయూసీ అనుబంధ సంస్థ 327 కార్మిక సంఘం ద్వారా ట్రాన్స్‌కో సీఎండీ ప్రభాకరరావుకు విన్నవించారు.

కోర్టు ఉత్తర్వులు బేఖాతరు

ఎన్ని విన్నపాలు చేసినా న్యాయం జరగడం లేదంటూ 5 గురు కార్మికులు 2011 డిసెంబర్‌లో హైకోర్టును ఆశ్రయించారు. ఇదే క్రమంలో సదరు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయడంవల్ల తమకేమీ నష్టం లేదంటూ, అప్పటి ఏపీసీపీడీసీఎల్, సీఎండీ క్రిష్ణప్రసాద్ ప్రభుత్వానికి లేఖ సైతం రాశారు. ఈలేఖ ఆధారంగా ఉద్యోగులను పర్మనెంట్ చేయాలనీ 2012 జనవరిలో హైకోర్టు ధర్మాసనం తీర్పు ఇచ్చింది. ఈ మేరకు హైకోర్టు తీర్పు ప్రతినిధిని కార్మిక సంఘ నాయకులతో కలిసి ట్రాన్స్‌కో ఉన్నతాధికారులను కలిసినా.. ఆ ఉత్తర్వులు అమలు కాలేదు..

ఇంధన శాఖ కార్యదర్శి ఆదేశాలూ..

ట్రాన్స్‌కో సీఎండీ నిర్ణయం తీసుకోక పోవడం వారి రాష్ట్ర ఇంధన కార్యదర్శిని కలిసి తమ సమస్యలను విన్నవించారు. కోర్టు ఉత్తర్వులను బేఖాతరు చేస్తున్నారని బాధితులు ఫిర్యాదు చేశారు. ఈనేపథ్యంలో ఇంధన శాఖ ప్రత్యేక కార్యదర్శి 2017లో.. సదరు కార్మికుల పర్మనెంట్ విషయంలో న్యాయ సలహా కూడా తీసుకున్నారు. ట్రాన్స్‌కోతో నాలుగేళ్ళపాటు ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపిన అనంతరం వారిని పర్మనెంట్ చేయాలని ఇంధన శాఖ ప్రత్యేక కార్యదర్శి పట్టి టీఎస్ఎస్‌పీడీసీల్ సీఎండీ రఘుమారెడ్డికి ఆదేశాలు జారీ చేశారు. ఐతే. సదరు ఆదేశాలను రఘుమారెడ్డి అమలు చేయక పోగా, దానిని ట్రాన్స్‌కో జేఎండీకి పంపి చేతులు దులుపుకున్నారు.

30 ఏళ్ళ క్రితం ఉద్యోగంలో చేరాం..



2005లో మా సంస్థ స్కోర్ మూసివేసినప్పుడు మమ్మలి అప్పటి ఏపీసీపీడీసీల్‌ల్లో విలీనం చేసుకున్నారు. కానీ ఉద్యోగ క్రమబద్ధీకరణ మాత్రం జరగలేదు. ఐదుగురం కోర్టుకెళ్లగా రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానము క్రమబద్ధీకరించాలని 2012లో తీర్పు ఇచ్చింది. సాక్షాత్తు ఇంధన శాఖ కార్యదర్శి ఆదేశించినా మాకు న్యాయం జరగలేదు. మా సగటు ఉద్యోగ కాలం వెట్టి చాకిరికి సరిపోయింది. ప్రస్తుత ప్రభుత్వంలోనైనా మాకు న్యాయం జరుగుతుందని విశ్వసిస్తున్నాం.

- జి.శేషశయనరెడ్డి, స్కోర్ కార్మికుడు


జోగిపేటలోని ట్రాన్స్‌కో కార్యాలయం

బెంగతో కార్మికుడి మృతి..

ఏళ్ళకేళ్ళుగా వేతనాలు పెరగకపోవడం, రెగ్యులరైజ్ కాకపోవడంతో తీవ్ర మనోవేదనకు గురైన పాపన్నపేట మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన కార్మికుడు అఫ్జల్ మృతి చెందాడు. మరణించిన కార్మికుడి కుటుంబంలో ఎవరికి ఉద్యోగం ఇవ్వకపోవడం అటుంచి కనీసం అంత్య క్రియలకు ఖర్చులు కూడా యాజమాన్యం ఇవ్వలేదు.

రెండు రకాల వేతనాలు..

స్కోర్ ఉద్యోగుల వేతనాల్లోనూ రెండు రకాలుగా చెల్లించడం ట్రాన్స్‌కో కే చెల్లింది. ఒకే సంస్థలో పనిచేస్తూ... ఒకేలా జీతభత్యాలు తీసుకుంటూ 2005లో అప్పటి స్కోర్ నుంచి 77 మంది కార్మికులు అప్పటి ఏపీసీపీడీసీఎల్ (ప్రస్తుత టీఎస్ఎస్‌పీడీసీల్) లో విలీనం అయ్యారు. కానీ, వీరిలో 28 మందికి మాత్రమే పే, డీప ఇస్తూ గత ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చి, మిగతా వారికి మొండిచేయి చూపింది. దీంతో మిగిలిన 49 మంది కార్మికులు మాత్రం ఆర్టీజన్‌కు వచ్చే జీత భత్యాలను పొందుతున్నారు.



భారతీయ సంస్కృతి ప్రపంచానికి దిక్సూచి

- గురువుల పరంపరతో దేశ వికాసం
- పతంజలి యోగ పీఠాధికారి స్వామి యజ్ఞదేవ్
- సిద్దిపేటలో రాష్ట్ర స్థాయి సూర్యనమస్కారాల పోటీ

సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి11: భారతీయ గురుపరంపర, సంస్కృతి వల్ల దేశ ఖ్యాతి ప్రపంచంపై చెరగని ముద్ర వేస్తున్నదని పతంజలి యోగ పీఠాధికారి స్వామి యజ్ఞదేవ్ అన్నారు. ఆదివారం సిద్దిపేట పట్టణంలోని బాలికల ప్రభుత్వ పాఠశాల మైదానంలో యోగాసన స్పోర్ట్స్ సిద్దిపేట జిల్లా అసోసియేషన్, వ్యాస మహర్షి యోగా సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన తెలంగాణ రాష్ట్ర స్థాయి సూర్య నమస్కారల పోటీ ఉత్సవంలో పతంజలి యోగ పీఠాధికారి స్వామి యజ్ఞదేవ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా, ధ్యానం, ప్రాణాయామం మొదలగు విద్యలు దేశాన్ని సుసంపన్నం చేశాయని తెలిపారు. గురువుల మార్గదర్శనంలో దేశం వికసిస్తుందని వివరించారు. ప్రపంచం ఎదుర్కొంటున్న సమస్యలకు భారతీయ సంస్కృతి సమాధానం చెబుతుందన్నారు. గురువులు చూపిన మార్గంలో పయనించి అద్భుతాలు సృష్టించాలని, అన్ని రంగాల్లో దేశాన్ని ప్రగతి పథంలో నడిపించాలని పిలుపునిచ్చారు. అనంతరం యోగా పోటీల్లో గెలుపొందిన వారిని అభినందించారు. కార్యక్రమంలో జిల్లా జడ్పీ ఛైర్‌పర్సన్ రోజాశర్మ, మున్సిపల్ ఛైర్‌పర్సన్ మంజుల రాజనర్సు, సిద్దిపేట జిల్లా వర్కింగ్ జర్నలిస్టుల సంఘం అధ్యక్షుడు రంగాచారి, సిద్దిపేట స్పోర్ట్స్ అథారిటీ కన్వీనర్ పాల సాయిరాం, సుడా మాజీ డైరెక్టర్ మచ్చ వేణుగోపాల్‌రెడ్డి, జాతీయ యోగా మెడలిస్ట్, శిక్షకులు తోట సతీష్, సంధ్య, సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు తోట అశోక్, తెలంగాణ డెంటల్ ఆసుపత్రి డాక్టర్ అరవింద్ పాల్గొన్నారు. సిద్దిపేట కేంద్రంలో ఆదివారం నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర స్థాయి సూర్య నమస్కారాల పోటీల్లో విజేతలను మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అభినందించారు. ఈ మేరకు ఆదివారం సాయంత్రం క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన విజేతలకు చెక్కులను, మెడల్స్, జ్ఞాపికలను అందజేశారు. సూర్యనమస్కారాల పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచిన పిల్లలను ఆశీర్వదించారు. జాతీయస్థాయిలో అద్భుతంగా రాణించాలని విజేతలకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహక ప్రతినిధులు తోట సతీష్ , సంధ్య, కే .అంజయ్య, తోట అశోక్, నిమ్మ శ్రీనివాస్‌రెడ్డి, చిప్ప ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.


ఆసనాలు వేస్తున్న మహిళలు



సమావేశంలో మాట్లాడుతున్న పతంజలి యోగ పీఠాధికారి స్వామి యజ్ఞదేవ్

పోరాడి హక్కులు సాధించాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు


సంగారెడ్డిలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 11 : కేంద్రప్రభుత్వంతో పోరాడి మన హక్కులను సాధించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జీ. సాయిలు పిలుపునిచ్చారు. సంగారెడ్డిలోని కేవల్ కిషన్ భవన్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో పది సంవత్సరాలుగా బీజేపీ అధికారంలో ఉన్నా, ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించలేదని విమర్శించారు. స్కీం వర్కర్లకు కనీస వేతనాలు రూ.18వేలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక, కర్షక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 16న నిర్వహించే దేశవ్యాప్త సమ్మె, గ్రామీణ బందులో అన్ని రంగాల వారు పాల్గొనాలని ఆయన కోరారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి యాదగిరి, ఆశ వర్కర్ల యూనియన్ వారు యశోద, వీరమణి, ప్రశాంతి, గంగా, వైష్ణవి, తదితరులు పాల్గొన్నారు.



బొబ్బిలికుంట దశ మారేనా?

- చెత్తాచెదారం నిండి దుర్వాసన
- సుందరీకరణ కోసం పదేళ్ల క్రితం ప్రతిపాదనలు

సంగారెడ్డి టౌన్, ఫిబ్రవరి 11 : జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలోని కొత్తబస్టాండ్ సమీపంలో ఉన్న బొబ్బిలికుంట నిరాదరణకు గురవుతున్నది. ఈ చెరువును సుందరీకరించాలనే ఉద్దేశంతో పదేళ్ల క్రితం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినప్పటికీ పట్టించుకోలేదు. 2014లో అప్పటి ప్రభుత్వం చెరువులను పునరుద్ధరించేందుకు మిషన్ కాకతీయ ద్వారా వేలాది కోట్లు ఖర్చు చేసినప్పటికీ సంగారెడ్డిలోని బొబ్బిలికుంటను విస్మరించారని విమర్శలున్నాయి.

బొబ్బిలికుంటను సుందరీకరించి బోటింగ్, ఫౌంటేన్‌ను ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు పంపించారు. 2012లో బొబ్బిలికుంట సుందరీకరణ కోసం అప్పటి ఎమ్మెల్యే జగ్గారెడ్డి సూచన మేరకు ఇరిగేషన్ అధికారులు రూ.5 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. తర్వాత 2014లో వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ ప్రతిపాదనను బుట్టదాఖలు చేసినట్లు ఆరోపణలున్నాయి. 2015లో మిషన్ కాకతీయ కింద సంగారెడ్డిలోని ఎర్రకుంట, మహబూబ్‌సాగర్, దుబ్బకుంట, తదితర చెరువుల్లో పూడికతీత, కట్ట మరమ్మతులు, తూములు, అలుగుల నిర్మాణం కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేసి బొబ్బిలికుంట సుందరీకరణను మాత్రం మరిచారు.

బొబ్బిలికుంట చెరువుకు మరమ్మతులు చేయకపోవడంతో గుర్రపు డెక్క, పిచ్చి మొక్కలు


చెరువులో గుర్రపు డెక్క, పిచ్చిమొక్కలు

చెత్తా చెదారంతో దుర్వాసన వస్తున్నది. పట్టణంలోని మటన్, చికెన్ దుకాణాల్లోని వ్యర్థాలను ఈ చెరువులోనే వేస్తుండడంతో దుర్గంధం వెదజల్లుతున్నది. మరోవైపు పక్కనే ఉన్న రాజీవ్ పార్కు, స్విమ్మింగ్ పూల్‌లోకి వచ్చే సందర్శకులు కూడా దుర్వాసనను భరించలేకపోతున్నారు.

పూడికతీత నిధులు హాంఫట్

బొబ్బిలికుంట పూడికతీత పనుల కోసం పట్టణ ప్రగతి కింద రెండేళ్ల క్రితం రూ.15 లక్షలు మంజూరు చేశారు. చెరువులో ఉన్న గుర్రపు డెక్క, పిచ్చిమొక్కలు, వ్యర్థాలను తొలగించేందుకు మున్సిపల్ పాలకవర్గం ఆమోదంతో 2022లో ఆ నిధులు మంజూరు కాగా, నామమాత్రంగా పనులు చేసి ఆ నిధులు స్వాహా చేసినట్లు విమర్శలున్నాయి. కాంట్రాక్టర్ కేవలం మూడు రోజులే పనులు చేసి చేతులు దులుపుకన్నాడు. బొబ్బిలికుంట సుందరీకరణ పట్ల మున్సిపల్ పాలకవర్గ సభ్యులు, అధికారులు శ్రద్ధ చూపడం లేదనే విమర్శలున్నాయి.

ఆక్రమణకు గురవుతున్న బొబ్బిలికుంట

అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోకపోవడంతో ఆక్రమణకు గురవుతున్నది. కొత్తబస్టాండ్ సమీపంలో ఉన్న ఈ కుంటలో ఇప్పటికే కొంతమంది అక్రమంగా ఇళ్లను నిర్మించి విక్రయించారు. చెరువును సుందరీకరిస్తే సందర్శకులతో పాటు పట్టణ వాసులు వాకింగ్ చేస్తూ ఆహ్లాదకర వాతావరణంలో గడిపేందుకు వీలుంటుందని ఆశాబావం వ్యక్తం చేస్తున్నారు.

మంత్రాలు చేస్తున్నాడని హత్య

- మద్యంలో విషం కలిపిన కొడుకు, తమ్ముడు
- 48 గంటల్లో కేసును ఛేదించిన పోలీసులు

సిద్దిపేట రూరల్, ఫిబ్రవరి 11: మంత్రాల నెపంతో తండ్రిని కన్న కొడుకే హత్యచేశాడు. ఈ కేసును సిద్దిపేట రూరల్ పోలీసులు 48 గంటల్లో ఛేదించారు. ఆదివారం సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను వివరాలను వెల్లడించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం నామాపూర్ గ్రామానికి చెందిన నిమ్మ భూమయ్య తన కుటుంబసభ్యులతో కలిసి సిద్దిపేట జిల్లా కేంద్రంలో నివాసముంటున్నాడు. భూమయ్య తమ్ముడు నిమ్మ కనకయ్య కుటుంబసభ్యులు సొంత గ్రామంలోనే నివాసముంటున్నారు. వారు తరచూ అనారోగ్యానికి గురవుతుండడంతో భూమయ్యపై అనుమానం పెంచుకున్నారు. మంత్రాలు చేయడమే కారణమంటూ భూమయ్యతో గొడవపడేవారు. ఈ క్రమంలో భూమయ్య కుమారుడు నిమ్మ ప్రవీణ్‌తో కలిసి భూమయ్యను హత్య చేసేందుకు కనకయ్య పన్నాగం పన్నాడు. ఈ నెల 10న వారి సొంత గ్రామం నామాపూర్‌కు భూమయ్యను పిలిపించి, ముగ్గురూ కలిసి మద్యం సేవించారు. రాత్రి కావడంతో భూమయ్యను సిద్దిపేటలో దింపేందుకు బైక్‌పై ముగ్గురు బయలుదేరారు. సిద్దిపేట రూరల్ మండలంలోని రాఘవాపూర్ గ్రామ శివారులో గల పిట్టలవాడ సమీపంలో మళ్లీ మద్యం సేవించారు. అక్కడ నిదితులు అనుకున్నట్లుగా మద్యంలో పురుగుల మందు కలిపి భూమయ్యకు తాగించడంతో భూమయ్య అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. అనంతరం మృతదేహంపై గడ్డివేసి తగులబెట్టి అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ ఘటనపై రాఘవాపూర్ గ్రామ కార్యదర్శి యాదగిరి సిద్దిపేట రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న ఎస్ఐ కిరణ్‌రెడ్డి విచారణ చేపట్టి 48 గంటల్లో నిందితులను పట్టుకుని రిమాండుకు తరలించారు.


నిందితుల వివరాలను వెల్లడిస్తున్న పోలీసులు

రూ.2లక్షల ఇన్సూరెన్స్ చెక్కు అందజేత

హత్నూర, ఫిబ్రవరి 11: హత్నూర మండల పరిధిలోని బడంపేట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ క్రియాశీలక కార్యకర్త లాలి నారాయణగౌడ్ ఇటీవల మృతి చెందాడు. ఆయన కుటుంబానికి పార్టీ నుంచి మంజూరైన రూ.రెండు లక్షల ఇన్సూరెన్స్ చెక్కును ఆదివారం ఆయన భార్య జ్యోతికి ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ ఆంజనేయులు, రైతుబంధు మండల కో ఆర్డినేటర్ బుచ్చిరెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శ్రీవాస్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

గ్రామాల స్వచ్ఛతే ప్రభుత్వ లక్ష్యం

- మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు
- చిన్నశంకరంపేటలో పర్యటన

చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 11: గ్రామాల స్వచ్ఛతే తమ ప్రభుత్వ లక్ష్యమని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు అన్నారు. స్పెషల్ డ్రైవ్ శానిటేషన్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం చిన్నశంకరంపేటలో పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పారిశుధ్య కార్మికులతోనే గ్రామాలు పరిశుభ్రంగా ఉంటాయన్నారు. అనంతరం పలు అభివృద్ధి పనులపై సమీక్షించారు. ఐబీ ఎదుట అండర్ గ్రౌండ్ డ్రైనేజీల మరమ్మతుల కోసం నిధులు మంజూరు చేయనున్నట్లు హామీ ఇచ్చారు. అనంతరం పారిశుధ్య కార్మికులు ఎమ్మెల్యేను కలిసి తమ సమస్యలను పరిష్కరించి, వేతనాలు పెంచేందుకు కృషి చేయాలని కోరారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ భాగ్యలక్ష్మిగోపాల్‌రెడ్డి, ఎంపీడీవో ప్రవీణ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నిఖిల, మిషన్ భగీరథ ఏఈ శైలేష్‌గౌడ్, మాజీ సర్పంచులు రాజిరెడ్డి, శ్రీమాన్‌రెడ్డి, రంగారావు, ఎడ్ల కిష్టయ్య ఎంపీవో గిరిధర్‌రెడ్డి, ఆర్ఐ గోవింద్, జంగరాయి సొసైటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ జీవన్, తదితరులు ఉన్నారు.



చిన్నశంకరంపేటలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే

క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు కప్ అందజేత

మెదక్ అర్బన్: మెదక్ జిల్లా స్పోర్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొండ శ్రీనివాస్ మెమోరియల్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ సీజన్-4 టోర్నమెంట్ నిర్వహించారు. స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో 40 ఏళ్లు దాటిన క్రీడాకారులకు నిర్వహించిన టోర్నీలో 10 జట్లు పాల్గొన్నాయి. అజాంపుర జట్టు గెలవగా పాస్నెట్ జట్టు రెండోస్థానంలో నిలిచింది. విజేత జట్టుకు మెదక్ ఎమ్మెల్యే రోహిత్ కప్‌ను అందజేశారు. మెదక్‌లో క్రికెట్ స్టేడియం ఏర్పాటుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్, డీవైఎస్‌వో నాగరాజు, స్పోర్ట్స్ ఫౌండేషన్ నిర్వాహకులు శ్రీనివాస్‌చౌదరి, మాధవరెడ్డి, శివశంకర్‌రావు, జుబేర్, సలీం, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి కొడకంచిలో బ్రహ్మోత్సవాలు



కొడకంచిలోని ఆదినారయణ స్వామి ఆలయం

జిన్నారం, ఫిబ్రవరి 11: మండలంలోని కొడకంచిలో ఆదినారయణ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ఈ నెల 12 నుంచి 22 వరకు నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఏర్పాట్లు పూర్తి చేసింది. పది రోజుల పాటు ఉత్సవాలు జరుగనున్నాయి. శ్రీదేవి, భూదేవి సమేతంగా వెలసిన ఈ ఆలయానికి వెళ్తే పాపా వినాశనం జరుగుతుందని భక్తుల విశ్వాసం. సుమావరు 400 ఏళ్ల క్రితం స్వయంభువునిగా వెలసిన ఆదినారయణ స్వామి ఆలయానికి సంగారెడ్డి, మెదక్, హైదరాబాద్ ప్రాంతాల నుంచి ఏటా బ్రహ్మోత్సవాలకు తరలివస్తారు. ఉత్సవాల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ఫౌండర్‌ట్రస్టీ చైర్మన్ అల్లాని సుధాకర్‌రావు తెలిపారు.

విగ్రహ ప్రతిష్ఠాపన

కల్హేర్/సిర్గాపూర్, ఫిబ్రవరి 11: సిర్గాపూర్ మండల పరిధిలోని చిన్న ముబారక్‌పూర్ గ్రామంలో నిర్మించిన ఆలయంలో ఆదివారం శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠాపన నిర్వహించారు. నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక పూజలు చేశారు. జాగృతి సంగారెడ్డి జిల్లా యువత అధ్యక్షుడు అరుణ్‌రాజ్ శేరికార్ కూడా ఉత్సవాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు జన్‌వాడే మధు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ జన్‌వాడే అశోక్ తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్‌కు అవార్డులు

రామాయంపేట, ఫిబ్రవరి 11: పలు సేవా కార్యక్రమాలు చేసినందుకు లయన్స్ (స్నేహబంధు) క్లబ్‌కు ఉత్తమ అవార్డులు దక్కాయి. శనివారం రాత్రి గజ్వేల్‌లో జరిగిన ఎక్సలెన్స్ కాన్ఫరెన్స్‌లో క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ బాబూరావు అందజేశారు. కార్యక్రమంలో ఐరేని రవీందర్‌గౌడ్, దీప్‌చంద్, దామోదర్ రావు, వలిశెట్టి సత్యనారాయణ, గడ్డం గంగారాం, జనతా శ్రీను పాల్గొన్నారు.

ఖేడ్‌లో బైక్ చోరీ

నారాయణఖేడ్, ఫిబ్రవరి 11: ఖేడ్ పట్టణంలోని రోడ్లు భవనాల శాఖ అతిథి గృహం వెనుక గల కాలనీలో పబ్బతి సంతోష్‌రెడ్డికి చెందిన బైక్ చోరీకి గురైంది. రోజులాగే శనివారం రాత్రి తన ఇంటి ఆవరణలో వాహనాన్ని నిలిపి ఉంచాడు. ఆదివారం తెల్లవారు జామున లేచిచూడగా బైక్ చోరీకి గురైంది. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

ఆర్యవైశ్య హాస్టల్ కార్యవర్గ సభ్యుడిగా నారాయణగుప్తా

తూప్రాన్, ఫిబ్రవరి 11: హైదరాబాద్ ముషీరాబాద్‌లోని వాసవీ ఆర్య వైశ్య హాస్టల్ కార్యవర్గ సభ్యుడిగా తూప్రాన్ పట్టణ మున్సిపల్ కౌన్సిలర్ కొడిప్యాక నారాయణగుప్తాను నియమించారు. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో పద్మశ్రీ గెల్లు రమేష్, వైశ్యరత్న గంజిరాజమౌళిగుప్తా చేతుల మీదుగా నారాయణగుప్తా నియామకపత్రం అందుకున్నారు. వైశ్య హాస్టల్ కార్యవర్గ సభ్యుడిగా నియామకమైన నారాయణగుప్తాను మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్, ఎమ్మెల్సీ దయానంద్ గుప్తా, టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, శివకుమార్, పారిశ్రామికవేత్త బండారు సుబ్బారావు, రమేష్‌గుప్తా సన్మానించారు.

వాటర్‌ప్లాంట్ ప్రారంభం

జహీరాబాద్, ఫిబ్రవరి 11: పైడి ఎల్లారెడ్డి చారిటబుల్ ట్రస్టు అధినేత, బీజేపీ రాష్ట్ర నాయకుడు పైడి ఎల్లారెడ్డి ఆదివారం మన్నాపూర్ గ్రామంలో వాటర్‌ప్లాంటును ఏర్పాటు చేసి, ప్రారంభించారు. కార్యక్రమాల్లో బీజేపీ నాయకులు క్రిష్టారెడ్డి, ఓంకార్, విశ్వనాథ్ పాల్గొన్నారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 11: చిన్నశంకరంపేట మండలంలోని భాగిర్థిపల్లి, సూరారం వాగు నుంచి యథేచ్ఛగా ఇసుక రవాణ కొనసాగుతున్నది. రాత్రి, పగలు తేడా లేకుండా ఇసుకను తరలిస్తున్నారు. అక్రమంగా ఇసుక రవాణ సాగుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదు. అక్రమ రవాణను అడ్డుకట్ట వేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

రేపటి నుంచి మాతా మణికేశ్వరీ ఆశ్రమ వార్షికోత్సవం

హత్నూర, ఫిబ్రవరి 11: హత్నూర మండలం సిరిపుర గ్రామ శివారులోని సద్గురు రూపరహిత అహింసా యోగేశ్వరీ వీర ధర్మజ మాతా మాణికేశ్వరీ ఓంకార్ ఆశ్రమ 27వ వార్షికోత్సవం ఈ నెల 13, 14వ తేదీల్లో నిర్వహించనున్నట్లు ఆశ్రమ పీఠాధిపతి దేవదాసు స్వామి తెలిపారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని వీర ధర్మజ మాత ఆశీస్సులు పొందాలని కోరారు.

గ్రామాల్లో స్వచ్ఛభారత్

తూప్రాన్/మనోహరాబాద్, ఫిబ్రవరి 11: తూప్రాన్ మండలం మల్కాపూర్ గ్రామంలో ఆదివారం 400వ వారం స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని 6వ వార్డు దుర్గమ్మ ఆలయం ప్రాంగణాన్ని శుభ్రం చేశారు. మనోహరాబాద్ మండలం కూచారం గ్రామంలో 301 వారం స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. నేచర్ ఐకాన్ యూత్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమనిన్ని నిర్వహించారు.

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నరేందర్‌రెడ్డి నియామకం



సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 11: బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా పార్టీ సంగారెడ్డి జిల్లా మాజీ అధ్యక్షుడు ఎం.నరేందర్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి ఆదివారం ప్రకటించారు. ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇచ్చిన బాధ్యతను జవాబుదారి తనంతో పనిచేసి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. కాగా జిల్లా కార్యవర్గంలో పలువురికి చోటు కల్పిస్తూ జిల్లా అధ్యక్షురాలు గోదావరిఅంజిరెడ్డి ప్రకటించారు. జిల్లా ఉపాధ్యక్షులుగా ఎ.వెంకట నర్సింహ్మారెడ్డి, ఆర్.ప్రభాకర్‌గౌడ్, కార్యదర్శులుగా బి.కుమార్, ఎం.నాగరాజు, కె.రజిని, జిల్లాలోని పట్టణ, మండల అధ్యక్షులను ప్రకటించారు.

నాగల్‌గిద్ద మండలాధ్యక్షుడిగా రాజశేఖర్



నాగల్‌గిద్ద, ఫిబ్రవరి 11: బీజేపీ నాగల్‌గిద్ద మండలాధ్యక్షుడిగా రాజశేఖర్ పాటిల్ ఆదివారం నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి బాధ్యతను అప్పగించినందుకు జిల్లా అధ్యక్షురాలికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు. తన నియామకానికి సహకరించిన పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సంగప్ప, ఖేడ్ అసెంబ్లీ కన్వీనర్ రజనీకాంత్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

జిన్నారం మండలాధ్యక్షుడిగా జగన్‌రెడ్డి



జిన్నారం: బీజేపీ జిన్నారం మండలాధ్యక్షుడిగా సోలక్‌పల్లికి చెందిన జగన్‌రెడ్డి నియమితులయ్యారు. ఆదివారం పార్టీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి జగన్‌రెడ్డికి నియామకపత్రాన్ని అందజేశారు. పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తానని ఈ సందర్భంగా జగన్‌రెడ్డి తెలిపారు.

వృద్ధుడి మృతదేహం లభ్యం

తూప్రాన్, ఫిబ్రవరి 11: తూప్రాన్ పట్టణ శివారులోని హల్దీ వాగులో గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం ఆదివారం గుర్తించినట్లు తూప్రాన్ ఎస్ఐ శివానందం తెలిపారు. తూప్రాన్ వాగులో కుళ్లిన స్థితిలో సుమారు 70 ఏళ్ల వయస్సుగల గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం లభ్యమైనట్లు వెల్లడించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించకపోగా, వృద్ధుడిపై ఉన్న షెక్తీ, దుప్పటి ఆధారంగా మతిస్థిమితంగా లేని వ్యక్తిగా అనుమానిస్తున్నారు. మృతదేహం నాలుగైదు రోజులు హల్దీవాగులో ఉండడంతో కుళ్లిపోయినట్లు ఎస్ఐ శివానం వివరించారు.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష


మెదక్ అర్బన్, ఫిబ్రవరి 11: గురుకులాల్లో 5వ తరగతిలో ప్రవేశానికి ఆదివారం మెదక్ జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. పరీక్ష నిర్వహణ కోసం మెదక్, తూప్రాన్, కొల్చారం, రామాయంపేట, తునికి గురుకులాల్లో మొత్తం 6 కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ పరీక్షకు 2,540 మంది విద్యార్థులకు గానూ.. 2,455 మంది(97 శాతం) హాజరు కాగా.. 80 మంది గైర్హాజరైనట్లు గురుకులాల వర్గాలు తెలిపాయి.

- హత్నూర: మండల కేంద్రమైన హత్నూరలోని గురుకుల పాఠశాలలో ఐదవ తరగతిలో చేరేందుకు ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా కొనసాగింది. 408 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా... 375మంది హాజరయ్యారు. 33మంది గైర్హాజరైనట్లు ప్రిన్సిపాల్ సుధాకర్ తెలిపారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం

నారాయణఖేడ్, ఫిబ్రవరి 11: నారాయణఖేడ్ పట్టణంలోని విరామ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి చక్కటి స్పందన లభించింది. హైదరాబాద్‌కు చెందిన మెడివిజన్ వైద్యశాల నేత్ర వైద్య నిపుణులు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కంటిపరీక్షలు నిర్వహించగా, డివిజన్ పరిధిలోని విరామ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పరీక్షలు చేయించుకున్నారు. 15 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని తెలుపడంతో వారిని రెండు రోజుల్లో హైదరాబాద్‌కి పంపుతామని విరామ ఉద్యోగుల సంఘం నాయకులు ముత్యాల కిష్టయ్య, నర్సింలు, త్యార్ల వీరయ్య తెలిపారు.

కౌడిపల్లి ఎస్ఐగా రంజిత్‌రెడ్డి



కౌడిపల్లి, ఫిబ్రవరి 11: కౌడిపల్లి ఎస్ఐగా రంజిత్‌రెడ్డి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. గత రెండు సంవత్సరాలుగా ఇక్కడ పని చేసిన ఎస్ఐ శివప్రసాద్‌రెడ్డి బదిలీపై కరీంనగర్ జిల్లాకు వెళ్లారు. ఆయన స్థానంలో సిద్దిపేట్ వన్ టౌన్ ఎస్ఐగా పని చేస్తున్న రంజిత్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ.. మండలంలోని ప్రజలకు తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. గ్రామాల్లో శాంతిభద్రతల రక్షణకు కృషి చేస్తానని తెలిపారు. అందుకు ప్రజలు సహకరించాలని కోరారు. ప్రతీ ఒక్కరు చట్టాలకు లోబడి నడుచుకోవాలని సూచించారు. అత్యవసర సమయంలో పోలీసులకు సమాచారం అందిస్తే సంఘటనా స్థలానికి చేరుకోని సహాయమందిస్తామన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఆరు గ్యారంటీల అమలుకు కాంగ్రెస్ కట్టుబడి ఉన్నది
- రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 11: అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. అందోల్ నియోజకవర్గంలోని మునిపల్లిలో ఆదివారం పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యా వైద్య వ్యవస్థను అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ముఖ్యంగా బాలికల చదువుపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని, ఈ ప్రాంత అభివృద్ధి, పిల్లల చదవు, ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని అధికారులకు సూచించారు. గతంలో తాను డిప్యూటీ సీఎంగా ఉన్నప్పుడు మోడల్ స్కూల్‌ను ప్రారంభించానని, దాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు, బాలికల హాస్టల్‌లో అవసరమైన సదుపాయాలు కల్పించేందుకు రూ.83 లక్షలు మంజూరు చేస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. అనంతరం మునిపల్లి జడ్పీహెచ్ఎస్‌ను మంత్రి సందర్శించారు. పాఠశాల భవనం శిథిలావస్థలో ఉండడంతో భవనాన్ని పూర్తిగా తొలగించి నూతన భవన నిర్మాణానికి అవసరమయ్యే ప్రతిపాదనలు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. పాఠశాల నూతన భవన నిర్మాణానికి రూ.4.50 కోట్ల నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలుకు కట్టుబడి ఉన్నదన్నారు. అనంతరం మునిపల్లి మండలం బుదేరా జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాల నుంచి మెయిన్ రోడ్డు వరకు జాతీయ రహదారి 9 నుంచి ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ వరకు రూ.60 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. కంకోల్ గ్రామంలో రూ.2.50 కోట్ల నిధులతో నిర్మిస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి శంకుస్థాపన చేశారు. అదే విధంగా పెద్ద చెల్మెడలో రూ.4.35 కోట్లతో నిర్మించనున్న జడ్పీహెచ్ఎస్ కొత్త భవనానికి శంకుస్థాపన చేశారు. తాటిపల్లిలో కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయంలో రూ.37 లక్షలతో చేపట్టనున్న రూఫ్, మరుగుదొడ్లు, పైప్‌లైన్, సెప్టిక్ ట్యాంక్ మరమ్మతుల పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో డీఈవో వెంకటేశ్వర్లు, ఇడబ్ల్యూఐడీసీ ఈఈ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీవో రవీందర్‌రెడ్డి, డీఎంఅండ్‌హెచ్‌వో గాయత్రి, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలతోనే గ్రామాల అభివృద్ధి

- నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్/కల్హేర్, ఫిబ్రవరి 11: మౌలిక సదుపాయాల కల్పనతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి తెలిపారు. ఆదివారం ఖేడ్ మండలం పోతన్‌పల్లి.ఎం, మాధ్వార్ గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణ పనులను, హైమాస్ట్ లైట్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తాము గ్రామాల అభివృద్ధికి మొదటి ప్రాధాన్యమిస్తామన్నారు. అనంతరం పెద్దశంకరంపేట మండలం మూసాపేటకు చెందిన మహిళా రైతు బాలమణి ఇటీవల మృతి చెందగా రైతుబీమా కింద రూ.5 లక్షల చెక్కును ఆమె కొడుకు మల్లేశంకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ నగేష్, నాయకులు రమేష్, కిష్టాగౌడ్, అంజిరెడ్డి, మారుతి, దస్తాగౌడ్, పెంటయ్య, శ్రీనివాస్, సాయిరెడ్డి పాల్గొన్నారు. నిజాంపేట మండల పరిధిలోని రాంరెడ్డిపేటలో నూతన గ్రామ పంచాయతీ భవనం, సీసీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే సంజీవరెడ్డి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మల్లేశం, రాంరెడ్డిపేట ఎంపీటీసీ క్రిష్ణ, నాయకులు భూమేష్, ప్రవీణ్‌గౌడ్, శ్రీకాంత్, రాధాక్రిష్ణ, ఎర్ర రవి, తుకారాం, శ్రీనివాస్, బేతయ్య జనార్ధన్, సంగయ్య తదితరులు పాల్గొన్నారు.



పోతన్‌పల్లిలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి

గృహలక్ష్మి దరఖాస్తులపై అధికారుల స్పెషల్ డ్రైవ్

నారాయణఖేడ్, ఫిబ్రవరి 11: ఖేడ్ మండలం పైడిపల్లిలో ఆదివారం విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో గృహలక్ష్మి పథకంలో భాగంగా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌కు సంబంధించి అవగాహన కల్పించారు. రేషన్ కార్డు, ఆధార్‌కార్డు, విద్యుత్ కనెక్షన్ నంబరు, ప్రజాపాలనలో అందజేసిన దరఖాస్తు నంబరును విద్యుత్ సిబ్బందికి తెలపాలన్నారు.

వెల్దుర్తి, ఫిబ్రవరి 11: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన గృహజ్యోతి పథకాన్ని అర్హులందరికీ అందించేందుకు చర్యలు చేపడుతున్నామని విద్యుత్ శాఖ తూప్రాన్ డీఈ రాజేందర్ తెలిపారు. ఆదివారం విద్యుత్‌శాఖ ఏఈ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మండల కేంద్రమైన వెల్దుర్తిలో ఏడీఏ రాజమల్లేశంతో కలిసి గృహజ్యోతి దరఖాస్తులపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. తెల్లరేషన్ కార్డు ఉన్న ప్రజల నుంచి వివరాలను సేకరించారు. నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను పొందడానికి వినియోగదారులు రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, ఫోన్ నంబర్‌తో పాటు విద్యుత్ సర్వీస్ నంబర్‌ను విద్యుత్ శాఖ అధికారులకు ఈ నెల 15వరకు ఇవ్వాలని సూచించారు.

- తూప్రాన్: తూప్రాన్ పట్టణ పరిధి పోతరాజుపల్లి విద్యుత్ కార్యాలయం వద్ద విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేశారు. ఏడీఈ రాజమల్లేశం, ఏఈ వరహాల బాబు, సబ్ ఇంజనీర్లు నరేందర్, సాధుల్లా పాల్గొన్నారు.
- మాసాయిపేట: మండల కేంద్రమైన మాసాయిపేటలో ఆదివారం విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో శిబిరం ఏర్పాటు చేశారు. 200 యూనిట్ల లోపు విద్యుత్ వాడకందారులను గుర్తించి అర్హులైన వారికి ప్రజాపాలన ఫలాలు అందించేలా చేయడమే లక్ష్యంగా శిబిరం ఏర్పాటు చేసినట్లు విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ సతీష్ వెల్లడించారు. ఇప్పటి వరకు దరఖాస్తు చేయని వినియోగదారులు తమ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయవచ్చు అని తెలిపారు.



వెల్దుర్తిలో వినియోగదారుల నుంచి వివరాలను సేకరిస్తున్న విద్యుత్ శాఖ అధికారులు

మాజీ సర్పంచులకు సన్మానం

మనూరు, ఫిబ్రవరి 11: మనూరు మండలంలోని తాజా మాజీ సర్పంచులకు ఆదివారం మండల కేంద్రమైన మనూరులోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా వీడ్కోలు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. వారిని ఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ఐదు సంవత్సరాల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పనుల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు విఠల్ రావు, మండల కో ఆప్షన్ సభ్యుడు సలీం, సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షులు నాగప్ప, శివాజీ, తదితరులు పాల్గొన్నారు.



మనూరులో తాజా మాజీ సర్పంచులను సన్మానించిన మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

బొల్లారంలో మల్లన్న స్వామి కల్యాణోత్సవం

జిన్నారం, ఫిబ్రవరి 11: బొల్లారం మున్సిపాలిటీలో మల్లన్న స్వామి కల్యాణోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. మల్లన్న బస్తీలో గల ఆలయంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామి వారి కల్యాణోత్సవం నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో కౌన్సిలర్లు చంద్రారెడ్డి, వేణుపాల్‌రెడ్డి, హన్మంతరెడ్డి, నాయకులు వరప్రసాద్‌రెడ్డి, యాదిరెడ్డి, నారాయణరెడ్డి పాల్గొన్నారు.



కల్యాణోత్సవంలో భాగంగా నిర్వహించిన అగ్ని గుండాలు

అంతరాలు లేని విద్య ప్రజల హక్కు

- టీపీటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ యాదగిరి



మహాసభలో పాల్గొన్న మెదక్ జిల్లా టీపీటీఎఫ్ నేతలు

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 11: అంతరాలు లేని విద్యా ప్రజల హక్కుతో పాటు ప్రభుత్వ బాధ్యత అని, సర్కార్ కామన్ స్కూల్ విధానాన్ని వెంటనే ప్రవేశపెట్టాలని టీపీటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ కొంగటి యాదగిరి డిమాండ్ చేశారు. ఆదివారం టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఖమ్మంలో రెండు రోజులుగా జరుగుతున్న రాష్ట్ర ద్వితీయ విద్య, వైజ్ఞానిక మహాసభలో ఆయన మాట్లాడారు. అందరికీ సమాన విద్య, సమాన అవకాశాలు దృష్ట్యా చైతన్యం తీసుకురావడానికి ఈ మహాసభలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ మెదక్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి సంగయ్య, వెంకట్‌రాంరెడ్డి, శశిధర్‌రెడ్డి, గోపాల్, హీరాలాల్, శ్రీనివాస్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో ఆర్టీసీ బస్సు నడిపిన డ్రైవర్

మెదక్, ఫిబ్రవరి 11: మద్యం మత్తులో ఆర్టీసీ బస్సును డ్రైవర్ నడపగా తృటిలో ప్రమాదం తప్పింది. ఆదివారం సాయంత్రం మెదక్ డిపోకు చెందిన ఆర్డినరీ బస్సును డ్రైవర్ మద్యం మత్తులో నడుపుతూ కొల్చారం మండలం పోతంశెట్టిపల్లి హనుమాన్ బండల వద్ద మలుపు తిరుగుతున్న క్రమంలో అదుపు తప్పింది. బస్సులో ఉన్న ప్రయాణికులు అరవడంతో బస్సును నిలిపివేశాడు. బస్సు కండక్టర్ ఈ విషయాన్ని డిపో అధికారులకు తెలపడంతో హుటాహుటిన అక్కడికి చేరుకుని బ్రీత్ అనలైజర్‌తో పరీక్షించడానికి యత్నించగా డ్రైవర్ సహకరించకుండా.. ఎదురుతిరుగడంతో వాగ్వాదం జరిగింది. అనంతరం ప్రయాణికులను మరో బస్సులో పంపించారు.

ఘనంగా మహిళా శక్తి సమ్మేళనం

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 11: మెదక్ విభాగ్ ఆధ్వర్యంలో ఆదివారం మెదక్‌లో మహిళా శక్తి సమ్మేళనం నిర్వహించారు. మహిళలతోనే భారతీయ సంస్కృతి, కుటుంబ విలువల పరిరక్షణ సాధ్యమని మెదక్ సరస్వతీ కాన్వెంట్ స్కూల్ ప్రిన్సిపాల్ కర్ని సుమిత్రాప్రభాకర్ పేర్కొన్నారు. మహిళా సాధికారత విద్యతోనే సాధ్యమన్నారు. విద్య అంటే కేవలం మార్కులు కాదని, జ్ఞాన సముపార్జన అని ఆమె అన్నారు. మహిళల భాగస్వామ్యం పెరిగినప్పుడే దేశ సమగ్రాభివృద్ధి సాధ్యమని చెప్పారు. మహిళల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకే మహిళా శక్తి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్య, వైద్య సామాజిక ధార్మిక, సేవ, ఉద్యోగ, వ్యాపార, క్రీడ, పారిశ్రామిక తదితర రంగాలకు చెందిన మహిళలు తమ అనుభవాలను వివరించారు.

సేవాలాల్ జయంతికి రావాలని ఆహ్వానం

జహీరాబాద్, ఫిబ్రవరి 11: జహీరాబాద్ పట్టణంలో ఈ నెల 15న నిర్వహించే సేవాలాల్ జయంతి ఉత్సవాలకు హాజరుకావాలని ఆల్‌ఇండియా బంజారా సేవాసంఘం నాయకులు ఆదివారం ఎమ్మెల్యే మాణిక్‌రావును ఆహ్వానించారు. సేవాలాల్ జయంత్యుత్సవాలను జహీరాబాద్ పట్టణంలో ఘనంగా నిర్వహిస్తామని ఆల్‌ఇండియా బంజారా సేవాసంఘం నాయకులు తెలిపారు. ఎమ్మెల్యేను ఆహ్వానించిన వారిలో ఆల్‌ఇండియా బంజారా సేవాసంఘం నాయకులు ప్రేమ్‌సింగ్, రాంరాథోడ్, శ్రీనివాస్‌నాయక్, వాసునాయక్, సంజుపవార్, విజయ్‌రాథోడ్, రాజుబానోత్, రవీందర్‌చౌహాన్ ఉన్నారు.

బాగారెడ్డి స్టేడియం గ్రౌండ్‌లో క్రికెట్ టోర్నమెంట్



టోర్నమెంట్ ముగింపు సంబురాల్లో మాజీమంత్రి చంద్రశేఖర్

జహీరాబాద్, ఫిబ్రవరి 11: జహీరాబాద్ పట్టణంలోని బాగారెడ్డి స్టేడియం గ్రౌండ్‌లో గత 20రోజులుగా ఉజ్వల్‌రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. ముగింపు కార్యక్రమానికి మాజీ మంత్రి చంద్రశేఖర్ హాజరై మాట్లాడారు. విన్నర్ జట్టుకు రూ.2లక్షలు, రన్నర్ జట్టుకు రూ.లక్ష బహుమతిగా ఇవ్వడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో జహీరాబాద్ ఎంపీపీ గిరిధర్‌రెడ్డి, ఉజ్వల్‌రెడ్డి ఫౌండేషన్ అధినేత ఉజ్వల్‌రెడ్డి పాల్గొన్నారు.

కన్యకాపరమేశ్వరీ పూజలు

నారాయణఖేడ్, ఫిబ్రవరి 11: వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఖేడ్‌పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక షిర్డీ సాయిబాబా ఆలయంలో మహిళలు వాసవీమాతకు పూజలు, సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. ఈ సందర్భంగా పురోహితులు మోహన్ జ్యోషి వాసవీ మాత ఆత్మార్పణ వృత్తాంతాన్ని వివరించారు. అనంతరం మహిళలు అమ్మవారికి ఒడిబియ్యం సమర్పించారు. మహాహారతి అనంతరం, మహాప్రసాద వితరణ చేపట్టారు. ఆయా కార్యక్రమాల్లో ఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్యవైశ్య మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

- చేగుంట: మండల కేంద్రంలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. కుంకుమార్చన, దీపారాధన గావించి కన్యకా పరమేశ్వరి అమ్మవారిని వేడుకున్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ అయిత వెంకటలక్ష్మి పాల్గొన్నారు.
- పెద్దశంకరంపేట: వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవం పురస్కరించుకొని పెద్దశంకరంపేటలోని ఆర్యవైశ్య భవనంలో మండల ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. ఉమ్మడి మెదక్ జిల్లా ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు లక్ష్మణ్‌గుప్తా వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవ విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ లక్ష్మి, మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాగం అర్చన, చకిలం విశాల తదితరులు పాల్గొన్నారు.



చేగుంట కన్యకా పరమేశ్వరీ ఆలయంలో పూజలు



పెద్దశంకరంపేటలో సామూహిక కుంకుమార్చనలు



ఖేడ్‌లో వాసవీ మాత పూజలో పాల్గొన్న మహిళలు

ప్రజలకు 24 గంటలు సేవలందించాల్సిన ప్రభుత్వాస్పత్రికి సిబ్బంది మధ్యాహ్నం 12గంటలకే తాళం వేశారు. మనోహరాబాద్‌లో ఆదివారం ఈ సంఘటన జరిగింది. ఆస్పత్రికి తాళం వేసి ఉండడంతో వైద్యం కోసం వచ్చిన పలువురు వెనుదిరిగి వెళ్లిపోయారు. ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన వైద్య సిబ్బంది ఆస్పత్రికి తాళం వేసి వెళ్లడం గమనార్హం. - మనోహరాబాద్

